
వివరాలు మెయిన్‌లో

**28లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 25 మే, 2026 | పేజీలు : 04

# 6,7 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు

## నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కొనుగోలు చేసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మిల్లులకు తరలించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వ లేకుండా క్లోజ్ చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగస్వాములైన అధికారులను ఆదేశించారు.ఆదివారం జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ముందే సిద్ధం చేసుకున్న కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రానున్న 6,7 రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకుగాను ప్రతి రోజు ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించడమే కాకుండా, సంబంధిత అధికారులతో సమీక్షించి, మిల్లుల వద్ద తక్షణమే ధాన్యం అన్‌లోడింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రికి తెలియజేశారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం మొత్తాన్ని వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మిల్లులకు తరలించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్లోజ్ చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లర్లు వెంటనే ధాన్యాన్ని దించుకోవాలని, ఏ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేసి రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అంతకు ముందు పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి ఎన్ .ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ఇంకా 8.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉందని, అధికారులు వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.మిల్లర్లు, ట్రేడర్లు తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ లేకుండా పూర్తిగా కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియను ముగించాలని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఎం రాంపతి , మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి ,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు .



### జిల్లా పరిషత్ పోస్టుల భర్తీకి పారదర్శకంగా ఇంటర్వ్యూలు

జిల్లా పరిషత్ ఆధీనంలోని పలు పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జిల్లా పరిషత్ ఆధీనంలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు,రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్, రాత్రి కావలాదారుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రేమ్‌కరణ్ రెడ్డి, తెలంగాణ మినిస్టీరియల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.



### కొత్తగూడెం వద్ద అండర్ పాస్ రహదారిని ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి నుండి హైదరాబాద్‌కు సురక్షిత ప్రయాణానికి కొత్తగూడెం వద్ద అండర్ పాస్ రహదారిని ఏర్పాట చేయాలని కోరుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి భువనగిరి టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాల శంకర్ ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రంగా ఉన్న భూదాన్ పోచంపల్లికి హైదరాబాదు నుండి కొత్తగూడెం వద్ద ఉన్న హైవే ఎన్హెచ్65 రోడ్డు ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో. పోచంపల్లి మండలానికి సంబంధించి సుమారు 30 గ్రామాల ప్రజలకు నిత్యం పోచంపల్లి నుండి నిత్యం హైవే దాటి హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన ఉండగా హైవే రోడ్డును దాటడానికి కష్టంగా మారింది. నిత్యం విపరీతమైన రద్దీగా ఉండే ఈ హైవే కారణంగా ఎందరో ప్రయాణికులు రోడ్డు దాటుతున్న క్రమంలో గాయపడడంతో, పాటు మరణించిన సందర్భాలు ఉన్నాయి. పర్యాటకులు కూడా ఈ గ్రామానికి వచ్చి తిరిగి హైవే దాటాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా కొత్తగూడెం పెద్ద అండర్ పాస్ నిర్మాణం చేస్తే పరిష్కారం దొరుకుతుందనీ కోరిన వెంటనే ఎంపీ స్పందిస్తూ అండర్ పర్స్ నిర్మించాలని కోరుతూ ఎక్స్ప్రెస్ హైవే అథారిటీకి అధికారిక లెటర్ పై ప్రతిపాదనలు పంపారు.

# కాంగ్రెస్ పార్టీపై నిరాధార ఆరోపణలు సరికాదు


వివరాలు మెయిన్‌లో

# జీవితాంతం నల్లమల గిరిప్రసాద్ రాజీలేని పోరాటాలు

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లొడంగి శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** పేదల హక్కుల కోసం నల్లమల గిరి ప్రసాద్ జీవితాంతం రాజీలేని సమరశీల పోరాటాలు నడిపారని నాయకులు పేర్కొన్నారు.ఆయన ఆశయాలను నేటి తరానికి చేరవేయాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లొడంగి శ్రావణ్ కుమార్ అన్నారు. నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన గెరిల్లా పోరాట గెరిలా దళం" నాయకుడు, సిపిఐ జాతీయ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరి ప్రసాద్ అమరజీవి అని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన విరోచిత పోరాటాలు నడిపి



భూమిలేని పేదలకు లక్షల ఎకరాల భూములను పంచడంలో అగ్రగామిగా నిలిచారని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన మార్గంలోనే సిపిఐ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కె.ఎస్. రెడ్డి,నాయకులు వి.లెనిన్, ఎండి అక్బర్,ముండ్ల ముత్యాలు,జిల్లా సత్యం, ఎస్ కె యూసుఫ్,సీతారాములు,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## బొలెరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** తానంచర్ల శిరోంచ జాతీయ రహదారి 365పై ఎదురుగా వస్తున్న బొలోరో వాహనం ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బొల్లంపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. అర్వపల్లి ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల గ్రామానికి చెందిన మేడిదల యాకస్వామి (27) హైదరాబాద్‌లో తమ బంధువులను దింపి వస్తుండగా అదే సమయంలో బొల్లంపల్లి గ్రామ శివారుకు రాగానే కోళ్లఫారం లోడ్‌తో ఎదురుగా వస్తున్న టాటా బొలెరో వాహనం ఢీకొట్టడంతో యాకస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

## బోడ స్వామికి పలువురి అభినందన



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా నియామకమైన చిట్యాలకు చెందిన బోడ స్వామిని ఆదివారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. అలాగే ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్‌నేతలను కలిసిన స్వామి వారి ఆశీస్సులను పొందారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, పార్టీ ఆదేశాలకనుగుణంగా వ్యవహరించాలని వారు ఈ సందర్భంగా సూచించారు. ఎస్‌సి వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు.

## మేరు కులస్థులకు ప్రాధాన్యత కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పథకాల అమలులో మేరు కులస్థులకు ప్రాధాన్యత కల్పించాలని మేరు కులస్థులు కోరారు. ఆదివారం పలువురు మేరు కుల సంఘం అధ్యక్షుడు దీకొండ ప్రసాద్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రభుత్వం అందించే కుట్టు మిషన్లను మేరు కులస్థులకు అందించి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా మేరు కులస్థులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సింగ్ కృష్ణ, తాళ్ల వసంతం, సాగర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కల్యాణోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.

## ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/ఆలేరు :** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ కాదూరి అచ్చయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చర్ శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం ఆలేరు పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర పెంచి రైతులకు న్యాయం చేయాలని బీజేపీ పార్టీ ముందుగానే రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసినప్పటికీ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ నెల 26వ తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ చిరిగే శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గత నెల రోజుల క్రితం భువనగిరి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రభుత్వానికి పలు సూచనలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి, యాదగిరిగుట్ట టౌన్ ప్రెసిడెంట్ కర్రె ప్రవీణ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పూల హనుమంతు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వడ్డేమాన్ నరేందర్, జిల్లా నాయకుడు జంపాల శ్రీనివాస్, మండల కార్యదర్శి బైరి మహేందర్ పాల్గొన్నారు.

## రైతు గోస -బిజెపి భరోసా' పేరిట యాత్ర



**ప్రజాపక్షం/భువనగిరి:** రేపటి నుంచి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద 'రైతు గోసా బీజేపీ భరోసా' పేరిట యాత్ర చేపట్టబోతున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ యదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ మాట్లాడుతూ యాత్రలో బాగంగా ఈనెల 26/05/2026న గజ్వేల్ నుండి మన జిల్లా మీదగా వివిధ మండలాలను సందర్శిస్తూ నేరుగా రైతులతో మాట్లాడితే ధాన్యం ఎంత కొనుగోలు చేస్తారో తెలుస్తోందని తెలిపారు. రెండు రోజుల పాటు రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము మాట్లాడిస్తామని, తమకు కావాల్సింది రైతుల సంక్షేమమని తెలిపారు. అన్నదాతలకు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని వేముల అశోక్ డిమాండ్ చేశారు. అలాగే భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులూ గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 26/05/2026 రైతు గోసా బీజేపీ భరోసారోజున గజ్వేల్ నుండి మన జిల్లా మీదగా జరుగుతున్న యాత్రను లో అధిక సంఖ్యా లో రైతులతో ముఖాముకి కార్యక్రమాని విజయవంతం చెయ్యాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, మాజి రాష్ట కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, భువనగిరి పట్టాన అధ్యక్షుడు రత్నపురం బలరాం, పాదరాజు ఉమా శంకర్ సురేష్ పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలను చెల్లించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్ముతున్నారే కాని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయడం లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆదివారం అన్నారు. విద్యార్థులు ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని చెబుతున్నాయని, ప్రభుత్వం మాత్రం ఫీజు బకాయిలను ఇవ్వకుండా వేల కోట్లను కాంట్రాక్టర్లకు మాత్రం ఇస్తున్నారని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల కోసమా కాంట్రాక్టర్ల కోసమా అని ప్రశ్నించారు.



## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మున్సిపల్ కౌన్సిలర్ సంద్రపాటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, నాయకులు బైరు వెంకన్న గౌడ్, అబ్దుల్ రహీం, చింతమళ్ల రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, దొంగరి గోవర్ధన్, కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, గునగంటి హేమసతీష్, రాపర్తి భవాని శ్రీనివాస్ గౌడ్, ఏలిమినేటి అభినయ్ నాయుడు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మార్కెట్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ కింద ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా డిసిసి జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అల్పాహార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుములపూరి రవి, డిసిసి కార్యదర్శులు నెరెళ్ల మధు, షేక్ మీరా, పోలెబోయిన లింగరాజు, గాజుల రాము, నాయకులు అనుములపూరి రాజీవ్, విజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఒకేషనల్ ట్రైనర్‌గా అశోక్




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** విద్యార్థులకు మెలకువలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ కే. అశోక్‌కుమార్ శనివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన 5వ సమర్థ్ భారత్ కాంక్లేవ్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఒకేషనల్ ట్రైనర్ అవార్డు తెలంగాణ వార్షిక కాన్ఫరేన్స్ 2026 అవార్డును అందుకొని తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చాడు. విద్యార్థులకు పాఠశాలలో రోబో టెక్నాలజీ, అర్టిఫిషల్ ఇంటలిజెన్స్, స్కిల్ ఎడ్యూకేషన్, ఇన్నోవేషన్ వంటి రంగాలలో ఆధునిక, సాంకేతిక విద్యను భోదిస్తూ వారి భవిష్యత్తుకు దిశానిర్ధేశం చేస్తున్న సేవలు అభినందనీయం అని స్టేట్ ఒకేషనల్ కో ఆర్డినేటర్ సాంబ శివరావు అన్నారని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఒకేషనల్ ట్రైనర్‌గా అవార్డు అందుకున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించినట్లు అశోక్ కుమార్ తెలిపారు. ఈ అవార్డు స్ఫూర్తితో తాను విద్యార్థులకు మరిన్ని సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.



## దాహార్తితో జింకల మూగవేదన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** లెంకలపల్లి,దామర, భీమన పల్లి, కమ్మగూడ, సరంపేట గ్రామాల మధ్య గల నల్ల రేగడి భూముల్లో దాదాపు 200 జింకలు సంచరిస్తుంటాయి. వేసవి తీవ్రతకు నీరు దొరక్క ఈ మూగజీవాలు తీవ్ర అల్లాడుతున్నాయి.దాహార్తితో నీళ్ల కోసం జనావాసాల్లోకి వస్తూ, కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి, జింకలు సంచరించే అటవీ ప్రాంతాల్లో నీటి తొట్లను ఏర్పాటు చేయాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

## ఇళ్లలోకి వచ్చిన జింకపిల్ల



**ప్రజాపక్షం/మర్రిగూడ:**మర్రిగూడ మండలం లెంకల పల్లి శివారు అడవి నుంచి దాహార్తితో ఒక జింకపిల్ల జనావాసాల్లోకి వచ్చింది. దానిని గమనించిన గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్సై బి.రాంబాబు తన సిబ్బందిని పంపి జింకపిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్ కు అప్పగించారు. ప్రస్తుతం జింకపిల్ల ఆరోగ్యంగా ఉందని, సాయంత్రం అడవిలో వదిలిపెడతామని అధికారులు తెలిపారు.

## సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కెవిటి

**ప్రజాపక్షం/త్రిపురారం:** తెలంగాణ గ్రామ పంచాయతీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా త్రిపురారం మండలం అంజన పెల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. హైదరాబాదులో జరిగిన సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశంలో సర్పంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సాధాని భూమన్న యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేవీపీ మాట్లాడుతూ తనను గుర్తించి సర్పంచుల పోరంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనను నిరంతరం ప్రోత్సహిస్తూ ప్రజాసేవ చేసేందుకు సహకరిస్తున్న మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఎంపీ రఘు రెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు జేవిరెడ్డి, ధన్యవాదాలు తెలిపారు.




## ఘనంగా ముగిసిన ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** కాలం ఎంత వేగంగా పరిగెత్తినా, జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా..బాల్యపు జ్ఞాపకాలు, చదువుకున్న పాఠశాల రోజులు ఎప్పటికీ మరువలేనివని నిరూపించింది.మర్రిగూడ మండలంలోని శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం నాడు పాఠశాలలో జరిగిన 2009/10 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేలనం ఎంతో ఘనంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. దాదాపు పదహారేళ్ల తర్వాత సహచర విద్యార్థులు ఒకరినొకరు కలుసుకోవడంతో పాఠశాల ఆవరణమంతా కోలాహలంగా మారింది. ఉదయం 10 గంటలకే మొదలైన ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, రామ కృష్ణ,ఆనంద్ ప్రసాద్, ప్రమోద్,నర్సింహా,శ్రీదేవి, స్వప్న, అన్నపూర్ణ, పూర్వ విద్యార్థులు కుక్కల వెంకటేష్, మెండే రమేష్, మంజుల, నాగరాజు, సుధాకర్, శంకర్,మహేందర్, సోని, రజిని, పరమేశ్వరి, రేవతి, సంతు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి చేయూతనివ్వాలి




**ప్రజాపక్షం/నకిరేకల్ :** పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి చేయూతనిస్తూ విద్యాసంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ బెల్లి యాదయ్య పిలుపునిచ్చారు.ఆదివారం కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల నకిరేకల్ ప్రాంతానికి ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమైన విద్యాసంస్థ అని పేర్కొన్నారు. గతంలో కళాశాలలో చదివి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కళాశాలకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలని, ప్రస్తుత విద్యార్థులకు కెరీర్ ఎదుగుదలపై సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. కళాశాల అంబాసిడర్లుగా బాధ్యత తీసుకుని అన్ని విధాలా తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కె. ప్రవీణ్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ నాగు, డా. శ్రీనివాసాచారి, శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి,డాక్టర్ శంకర్, నర్సింహాచారి,శివశంకర్,ఉపేందర్, రవీందర్, సుభాషిణి, వెంకన్న, నరేందర్, పూర్వ విద్యార్థులుపాల్గొన్నారు.

## ఉచిత యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** వేసవి కాలం సందర్భంగా విద్యార్థులకు, పెద్దవారికి సాఫ్ట్వేర్ ఇంజనీర్,గృహిణులు వ్యాపారవేత్తలకు శ్రీ సత్య సాయి యోగ సేవ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉచితంగా యోగ శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ యోగ గురూజీ ఊటుకూరి నాగేశ్వరావు కోరారు. ఆదివారం పట్టణంలోని రవీంద్ర నగర్ కాలనీ ఫణివిహార్ సెంటర్ లో ఉచిత యోగ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజ్య గురువులు బిక్షమయ్య గురూజీ సూర్యకుమారీ మాతాజీ వారి ఆశీస్సులతో యోగ సాధనలో ఉంటూ గత 17 సంవత్సరాలు గా 4 బ్యాచులు ఉచితంగా యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు అదేవిధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తూ వారిని 50 మంది గురువులుగా తయారు చేశానని వారు కూడా కొన్ని సెంటర్లలో ఉచితంగా యోగ శిక్షణ తరగతులు నేర్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌనిక పసనూరి, దాసిరెడ్డి వినీత, విద్యార్థులు, చిన్నారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెంతెకోస్తు దినోత్సవం

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని ఖాసీంపేట బేతెస్థ ప్రార్థన మందిరంలో ఘనంగా పెంతెకోస్తు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవ. దుర్గం కరుణశ్రీ (హెప్సిబా) ఇటీవల కాలంలో ఇంటర్ నేషనల్ ఇండిపెండెంట్ అపొస్తలిక్ డయాసిస్ ఆఫ్ సీనాడ్ శ్రీలంకలో రెవరెండ్ ఆర్డినేషన్ పొందిన సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబాలను సంఘ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్, హెప్సిబాలు మాట్లాడుతూ ఈస్టర్ పండుగ తరువాత వచ్చే 50వ రోజును క్రైస్తవులు ప్రపంచ వ్యాప్తంగా పెంతెకోస్తు దినోత్సవం జరుపుకుంటారని వివరించారు. అందరూ ఒకచోట ఉన్నప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వారు కూర్చుండిన యిల్లంతయు నిండెనని అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్లుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కరి మీద వ్రాలగ అందరూ పరిశుద్ధాత్మతో నిండినవారై వాక్శక్తి అనుగ్రహించి అన్యభాషలలో మాట్లాడారని బైబుల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటన ద్వారానే క్రైస్తవ సంఘం యొక్క పుట్టినరోజుగా పరిగణిస్తారని, గ్రీకు భాషలో పెంతెకోస్తు అనగా యాబై అని అర్థం అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, ఉపేందర్, వెంకన్న, కాల్వపల్లి సర్పంచ్ సంద్రపంగు వెంకన్న, నాగేశ్వరరావు, యడవెల్లి బిక్షం, అబ్రహాం, దావీదు, సురేష్, సైదులు పాల్గొన్నారు.






## మానవసేవయే మాధవసేవ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మానవునికి సేవ చేసినట్లయితే మాధవునికి సేవ చేసినట్లేనని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ఎదుట బాటసారులకు వేసవి సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవే లక్ష్యంగా వికాస తరంగిణి సేవలు అందిస్తుందని తెలిపారు. మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చుటకు గత 15 రోజులుగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పలువురు వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమి..నిర్మానుష్యంగా నకిరేకల్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** భానుడి భగభగలతో నకిరేకల్ పట్టణం నిప్పుల కొలిమిని తలపించింది. ఆదివారం నమోదైన 45 డిగ్రీల ఉష్ణోగ్రతతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు.మధ్యాహ్నం వేళల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.అత్యవసర పనులు మినహా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.ఎండ తీవ్రతకు వ్యాపార ప్రాంతాల్లో రద్దీ తగ్గగా,బయటకు వచ్చిన వారు తలకు వస్త్రాలు కట్టుకుని, గొడుగులు వినియోగిస్తూ కనిపించారు. చిన్నారులు, వృద్ధులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వైద్య నిపుణులు ప్రజలు తగినంత నీరు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలని, మధ్యాహ్నం సమయంలో అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

## ఆత్మీయ భరోసా హామీ వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం పట్టణంలోని నర్రా భవనంలో ఆ సంఘం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో 100 రోజుల పని పూర్తిచేసిన అర్హులైన కుటుంబాలకు ఆత్మీయ భరోసా అమలు చేయాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ.5 వేల పెన్షన్, ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కార్డు, నిత్యావసర వస్తువుల సరఫరా, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమని, కార్మిక హక్కులను పరిరక్షించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ, మర్రి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, జిల్లా సహాయ కార్యదర్శులు చెరుకు పెద్దులు, చింతపల్లి లూర్దు మారయ్య, నాయకులు సకుంట్ల నరసింహ, ఏర్పుల తాజేశ్వర్, మక్క బుచ్చిరాములు, దండు నాగరాజు, చౌగోని నాగయ్య, సురేందర్, మర్రి బక్కయ్య, బల్లెం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సాధన కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకై అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సాధన కమిటి సమావేశం ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటిని ఎన్ను కోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా అల్వాల జగతి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ కాశీ మంజుల ఆంజనేయులు, సలహాదారుగా ఉపసర్పంచ్ చంద్రగిరి వెంకట య్య, ఉపాధ్యక్షులుగా భూషణం, బిక్షం, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, స్వామి, కోశాధికారిగా అనిల్, కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, అశోక్, బలేష్, విక్రమ్, శేఖర్, యాకుబ్, ప్రశాంత్ లను ఎన్నుకున్నారు.

## ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/నూతనకల్ : మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన దాసరోజు శివకోటయ్య చారి ఇటీవల మృతి చెందగా తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఒక క్వింటా బియ్యాన్ని ఆదివారం ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జటంగి సరిత కృష్ణ, మాజీ సర్పంచ్ కొప్పర్ల బాబు, మాజీ వార్డు సభ్యులు గాజుల ఉపేందర్, రైతు సమితి మాజీ కోఆర్డినేటర్ తూముల వెంకటేశ్వరరావు, కొరివి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంతియాజ్ ఇర్ఫాన్ ఇక్బాల్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు పురపాలక సంఘం కోఆప్షన్ సభ్యురాలిగా నియమితులైన ఇంతియాజ్ ఇర్ఫాన్ ఇక్బాల్ గారిని ఆదివారం రోజున ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవా భావాన్ని కొనియాడారు. అనిల్ మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గా ఎర్రజెండాను భుజాన వేసుకుని నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్న సిపిఎం పట్టణ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇక్బాల్ కుటుంబానికి ఈ గౌరవం దక్కడం ఆనందదాయకమని పేర్కొన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం...



ప్రజాపక్షం/బొమ్మలరామారం : బొమ్మలరామారం మండలం జడ్పీహెచ్‌ఎస్ హై స్కూల్ 1999/2000 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ఉన్న ఓం శివ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఆపద వస్తే అండగా ఉంటామని. జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో నేటి విద్యార్థులకు చదువుకోవడానికి ఉపయోగపడే వస్తువులు వారికిఅవసరమైన సహాయం చేస్తామని వారు అన్నారు. గత స్మృతులను నెమరు వేసుకుంటూ నేటి తరంలో ఎలా ఉండాలో తమ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచే విధంగా కొందరి జీవన శైలి ఉందని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బేతాళ పాండు, పండుగ ప్రభాకర్, జూపల్లి బాలకృష్ణ, మైలారం సుదర్శన్ తిరుమల శోభన్ బాబు గౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, సిద్ధిరాజు బేతళ యాదగిరి, కైలాష్ జైహిందర్, రాజకుమార్, శ్రీ వాణి, జిత, జానకి, సబిత రాములమ్మ, అనురాధ, సునీత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/మోటకొండూర్ : బాల్యంలో చేసిన చిలిపి చేష్టలను నేమరు వేసుకోవడానికే పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు మానస విద్యామందిర్ ప్రిన్సిపాల్ నిమ్మ శేఖర్ రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని ముత్తి రెడ్డిగూడెంలోని మానస విద్యా మందిర్ ఏర్పాటు చేసిన 2010/11 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా, భావోద్వేగాల మధ్య జరిగింది.మొదటగా బ్యాచ్ లో రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రులు కంది శశిధర్ రెడ్డి, రావుల నాగరాజుల చిత్రపటాలకు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు విద్యార్థులంత కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సామ భూపాల్ రెడ్డి, బిఎంఆర్ఎస్ అధినేత బొప్పిడి మల్లారెడ్డి, కరస్పాండ్ రాఘవేందర్ రెడ్డి, ఎండీ మధార్, వెంకటేశం, సంతోష్, ఆనంద్, లత, నిర్మల, పూర్వ విద్యార్థులు రమేష్ రెడ్డి, లింగస్వామి, నాగరాజు, సతీష్, ఫయాజ్, సాయి, భగవాన్ రెడ్డి, నవీన్, పవన్, మధు, శశి, శ్రీకాంత్, లత, కల్యాణి, శ్రీలత, సోని, అఖిల, సౌజన్య, మౌనిక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# వరాలు ఇవ్వకుండానే వెనుదిరిగిన సీఎం..

### అధికారుల నిర్లక్ష్యమే కారణం!
### అధికారుల 'ప్రోటోకాల్' లోపమే ఆలేరు ప్రజల ఆశలపై చన్నీళ్లు!
### మాఫియాలకు కాపలా.. సీఎం పర్యటనపై నిర్లక్ష్యమా?
### జిల్లా అధికారుల తీరుపై బిఆర్ఎస్ నేత కల్లూరి ధ్వజం



ప్రజాపక్షం/భువనగిరి : అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజ కవర్గానికి ఎలాంటి అభివృద్ధి వరాల జల్లులు కురిపించకుండా యాదగిరిగుట్ట పర్యటనను ముగించుకొని మౌనంగా వెళ్లిపోయారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే ఇక్కడి ప్రజలకు, రియల్ ఎస్టేట్ రంగానికి చేకూరాల్సిన వందల కోట్ల ప్రయోజనం చేజారిపోయిందని ఆయన మండిపడ్డారు. ఆదివారం భువనగిరిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు రావడం ఇది నాలుగో సారని, ఈ పర్యటనతో ఆలేరు నియోజకవర్గానికి రూ.400 నుండి 500 కోట్ల నిధుల వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల సీఎం ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెనుతిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడైనా ఒక ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ అయిన తర్వాత, రిసీవ్ చేసుకోవడానికి ప్రోటోకాల్ అధికారులు లేక 15 నిమిషాల పాటు చాపర్లోనే ఎదురుచూసిన దౌర్భాగ్యపు దాఖలాలు ఉన్నాయా?, ముఖ్యమంత్రి పదవి అంటే జిల్లా యంత్రాంగానికి అంత చులకనా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారుల వరకు అందరూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ భజనలో మునిగిపోయి, అసలు సీఎం ఎక్కడ దిగుతున్నారో కూడా తెలియని సోయిలో ఉన్నారని మండిపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ పరిపాలన ఎంత దారుణంగా భ్రష్టుపట్టిపోయిందో చెప్పడానికి ఇక్కడ సాగుతున్న భూదందాలే నిదర్శనమని, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముగాస్తున్నారని రామచంద్రారెడ్డి ఆరోపించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలోని సర్వే నెంబర్ 726 లో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక కార్పొరేట్ రియల్ ఎస్టేట్ సంస్థ కాజేస్తుంటే.. పూర్తి ఆధారాలతో 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసి రెండు నెలలు దాటినా అధికారులు 'చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు' వ్యవహరిస్తూ బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. అలాగే చల్లూరు గ్రామంలోని సర్వే నెంబర్ 324లో ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్రషర్ నడుపుతూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న అక్రమ క్రషర్లను కూల్చేస్తున్న అధికారులు, యాదాద్రి జిల్లాలో మాత్రం అక్రమార్కులకు ఎందుకు కొమ్ముగాస్తున్నారని, ఇందులో అధికారులకు అందుతున్న వాటాలెంత అని నిలదీశారు. రైతుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోందని, మక్కా (మొక్కజొన్న) లోడుతో లారీలు రోడ్లపై బారులు తీరినా జిల్లాలో పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. జిల్లాలో గాడి తప్పిన పరిపాలనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఫోకస్ పెట్టాలని డిమాండ్ చేశారు. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, సీఎం పర్యటనను అట్టర్ ఫ్లాప్ చేసి, అక్రమార్కులకు తొత్తులుగా మారిన అధికారులపై తక్షణమే వేటు వేసి, సస్పెండ్ చేయాలన్నారు. యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ముందుకు తీసుకెళ్లడానికి ఆర్థిక శాఖ నుంచి నిర్మాణదారులకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నత్త నడకన సాగుతున్న బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్ పనులను పరుగులు పెట్టించడానికి, భూ నిర్వాసితుల పరిహారానికి తక్షణమే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

### కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండలంలోని వెల్లంకి,సిరిపురం,రామన్నపేట పట్టణం, దుబ్బాక, మునిపంపుల, ఎన్నారం గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంట వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఆదివారం టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యాదగిరిగుట్ట జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, కొలనుపాక జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, సర్పంచ్ బేదరబోయిన యకమ్మ వెంకటేష్, టంగుటూరు సర్పంచ్ జుకంటి అనిల్, గ్రామశాఖ అధ్యక్షుడు జంగా స్వామి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు భానుచందర్ హాజరయ్యారు.

## ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని దయ్యంబండ తండా గ్రా మంలో భువనగిరి పట్టణంలోని ఆర్వే హాస్పిటల్, చావా ఫౌండేషన్ తారక్ దయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో 1394 ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చేత ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, బిపి, షుగర్, న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజే శారు. బీపీ, షుగర్, థైరాయిడ్, మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు, వాటి నివారణకు తీసుకొని వలసిన తగు జాగ్రత్తలను గురించి వివరించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వాంకు తోడు సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ నవీన్ నాయక్, వార్డు సభ్యులు హాజరయ్యారు.